www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 నవంబర్ 2023
5
తిరుపతి

12న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల జీవితాలలో దీపావళి వెలుగు రేఖలు ప్రసరించాలని, ప్రతి ఇంట్లో ఆనందం, సంతోషపు వెలుగులు వెల్లివిరియాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి ఆకాంక్షించారు. శనివారం ఒక ప్రకటనలో వారు శ్రీవారి భక్తులకు, ఉద్యోగులకు, శ్రీవారి సేవకులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారి అనుగ్రహంతో రాష్ట్రం, దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని వారు కోరారు.

శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా ఉదయం 7 నుండి ఉదయం 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం జరుగుతుంది.

కల్యాణ కట్టలో వేధింపులు మానుకోవాలి

- తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి
- పది రోజుల్లో సమస్యలు పరిష్కరించకుంటే
- టిటిడిఎడి బిల్డింగ్ ముట్టడి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుమల కళ్యాణకట్టలో వేధింపులను మానుకోవాలని, కేడీ (కెప్ట్ ఆన్ డ్యూటీ)ని రద్దు చేయాలని తిరుపతిలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. శ్రీవారి కళ్యాణకట్ట నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం తిరుపతి నగరంలోని యశోదానగర్ వేమన విజ్ఞాన కేంద్రంలో మేళ్ల చెరువు గంగులప్ప అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ తిరుమలలో పనిచేసే కళ్యాణకట్ట క్షురకులను టీటీడీ యాజమాన్యం వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. కళ్యాణకట్టలో 849 మంది క్షురకులు పని చేస్తున్నారని, కేఓడి పేరిట 49మందికి డ్యూటీలు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమన్నారు. సంవత్సర కాలంగా తొలగించిన వారు జీతభత్యాలు లేక అవస్థలు పడుతున్నారని, వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య మరికొందరు యాజమాన్యానికి అనుకూలంగా మాట్లాడటం దారుణమని విమర్శించారు. అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రోజులలో మహిళలను చేతులతో తాకటం, బట్టలిప్పి తనిఖీ చేయడం సిగ్గుచేటని అన్నారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వెంటనే స్పందించి తిరుమల కళ్యాణ కట్టలో పనిచేసే క్షురకులకు న్యాయం చేయాలని కోరారు. పది రోజులలో సమస్యను పరిష్కరించని పక్షంలో తిరుపతిలోని టీటీడీ ఎడి బిల్డింగ్ ఎదుట నవంబర్ 21వ తేదీ మంగళవారం పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.నాగరాజు మాట్లాడుతూ టీటీడీలో కార్మిక చట్టాలు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఎక్కడా లేని కేఓడి విధానాన్ని తిరుమల కళ్యాణకట్టలో పనిచేసే క్షురకులకు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. శ్రీవారి కళ్యాణకట్ట నాయిబ్రాహ్మణ సంఘం కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ క్షురకులను అదేపనిగా వేధిస్తున్నారని పలు ఘటనలను ఉదహరించారు. టీటీడీ యాజమాన్యం తమపై కక్ష కట్టడం అన్యాయమని కేఓడి విధానాన్ని రద్దుచేసి తొలగించిన పీస్‌రేట్ క్షురకులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాధాదేవి మాట్లాడుతూ తిరుమల కళ్యాణకట్టలో మహిళా క్షురకుల బట్టలిప్పి తనిఖీ చేయడం దారుణమని అన్నారు. ఇలాంటి ఘటనలు భారతదేశంలో ఎక్కడా జరగటం లేదని గుర్తుచేశారు. కేఓడి పేరుతో తొలగించిన కార్మికులను పనుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ క్షౌరవృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు గంగులప్ప మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి క్షురకుల సమస్యలపై పోరాడి అనేక హక్కులను, సాధించుకున్నామని గుర్తుచేశారు. బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్రనేత బుట్టా సుధాకర్ యాదవ్, తిరుపతి అధ్యక్షులు సురేష్ నాయి బ్రాహ్మణ సంఘం నేతలు సదాశివం, బుజ్జి బాబు, సుధాకర్, శ్రీహరి, సుమతి ప్రసంగిస్తూ ప్రశ్నించిన వారిని ఉద్యోగం నుంచి తొలగించడం దారుణమన్నారు. కళ్యాణకట్ట క్షురకుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, టి.సుబ్రహ్మణ్యం, నాగ వెంకటేష్, వేణుగోపాల్, చిన్నా, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, జయంతి మద్దతు తెలిపారు.

క్షురకులను విధుల్లో తీసుకోవాలి..

తిరుమల కళ్యాణ కట్టలో పనిచేసే క్షురకుల తొలగించిన వారిని వెంటనే పని లోకి తీసుకోవాలని కోరారు. తమ తప్పులు ఏమీ లేకపోయినా కూడా కక్షగట్టి కేఓడి పేరుతో ఉద్యోగం నుంచి తొలగించడం అన్యాయమని బాధితులంటున్నారు. ఉద్యోగం నుంచి తొలగించిన వారిని పనిలో పెట్టుకోవాలని కోరుతూ కోర్టుకు వెళ్లిన వారిపై కూడా కక్ష సాధింపులు పేరుతో ఉద్యోగంలో తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇలాగైతే జీవనం సాగేదెలా అని ప్రశ్నిస్తున్నారు. కళ్యాణ కట్టలు పీస్‌రేటు క్షురకులు గత 12 నుంచి 15 సంవత్సరాలు పనిచేస్తూ అనుభవం కలిగిన వారు ఉన్నారు. భక్తులు నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకపోయినా కూడా క్షురకులను చిన్న తప్పులు చేసిన కేఓడీ పేరుతో ఉద్యోగం నుంచి తీసి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏడాదిగా ఉద్యోగం లేదు..

- వనజ, కళ్యాణ కట్ట మహిళా క్షురకురాలు

నేను గత 13 సంవత్సరాలుగా తిరుమల కళ్యాణ కట్టలో పనిచేస్తున్నాను. గత ఏడాది కళ్యాణ కట్టలో ఓ భక్తురాలు కుమార్తెకు గుండు చేస్తుండగా చిన్న గీత పడింది, గుండు చేసుకోవడానికి ఆ చిన్న పాప ఏడవడం కదలడం వల్లే చిన్న గాయమైంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కేఓడీ పేరుతో నెలరోజులు ఉద్యోగం నుంచి తొలగించారు. ఏడాది పాటు గడిచిన పనిలో తీసుకోలేదు. కోర్టును ఆశ్రయించడం వల్ల టిటిడి కళ్యాణ కట్టలు ఉద్యోగం ఎంతవరకు ఇవ్వలేదు, ఇలాగైతే మేము ఎలా బతకాలి. ఇప్పటికైనా టీటీడీ ఉన్నతాధికారులకు తమ న్యాయం చేయాలి.

యూనియన్ నాయకుడుగా ఉండడం వల్లే ...

- ప్రసాద్, కళ్యాణ కట్టల పీస్‌రేట్ అసోసియేషన్ కార్యదర్శి

కళ్యాణ కట్టలు పీస్ రేట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఉండటం వల్లే నన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. నేను ఏ తప్పు చేయలేకపోయినా ఏడాది నుంచి ఉద్యోగం తొలగించారు. ఉద్యోగం జీతం లేక నానా ఇబ్బందులు పడుతున్నాను. ఉద్యోగం ఇవ్వాలని పలుమార్లు ఉన్నతాధికారులు కలిసినా వారు ఎటువంటి న్యాయం చేయలేదు. హైకోర్టును ఆశ్రయిస్తే టీటీడీ ఉన్నతాధికారులను కోర్టు కూడా తనను ఎందుకు తొలగించారనే కారణం చూపలేదు. తప్పులు చేసిన వారిని ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుండా యూనియన్ నాయకుడైన తనను ఉద్యోగం నుంచి తొలగించడం దారుణం. ఇప్పటికైనా నాకు ఉద్యోగం కల్పించే న్యాయం చేయాలి.

మొబైల్ లైట్ వెలుగులో గుండు చేశానని..

- సుమతి, కళ్యాణ కట్టలో మహిళా క్షురకురాలు

కళ్యాణకట్టలో విద్యుత్ లేకపోయినా నాపై ఒత్తిడి తెచ్చి వెంటనే గుండు చేయాలని భక్తులు కోరారు, అయినప్పటికీ నేను తిరస్కరించాను, గుండు చేయించుకోవడానికి ఎక్కువ గంటల సమయం ఇక్కడ వేచి చూస్తున్నామని భక్తులు బయట ఊర్లో వెళ్లాలని సమయం అవుతుందని చెప్పడంతో వారి మొబైల్ ఫోన్ టార్చ్‌లైట్ ఫ్లాష్ వెలిగించి గుండు చేయాలని కోరడం వల్లే నేను భక్తులకు గుండు చేయడం జరిగింది. దీని కారణంగానే కేఓడి పేరుతో ఉద్యోగం నుంచి తొలగించారు. జరిగిందాట్లో నా తప్పు ఏమీ లేకపోయినా నన్ను ఉద్యోగంలో నుంచి తొలగించడం అన్యాయం. టీటీడీ ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలి.

'ప్రజా రక్షణభేరి' స్కూటర్ ర్యాలీ

శ్రీకాళహస్తిలో 'ప్రజా రక్షణభేరి' స్కూటర్ ర్యాలీలో నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఈ నెల 15వ తేదీన విజయవాడ వేదికగా జరిగే సీపీఎం ప్రజారక్షణ భేరి బహిరంగ సదస్సును జయప్రదం చేయాలంటూ శనివారం స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. తొట్టంబేడు మండలం చిట్టత్తూరు నుంచి ర్యాలీ ప్రారంభమై కొత్తకండ్రిగ, శివనాథపాలెం మీదుగా పట్టణంలోని రాజీవ్ నగర్ కైలాసగిరి కాలనీకి చేరుకుంది. అంబేద్కర్ కూడలి నుంచి నాలుగు మాడవీధులులో ప్రజారక్షణ భేరి ఉద్దేశంను సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రజలకు వివరించారు. ప్రజా ప్రణాళికకు వేదిక కానున్న ప్రజారక్షణ భేరిని జయప్రదం చేసేందుకు ప్రజలు విజయవాడకు తరలి రావాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి మండలంలో కూడా ప్రజారక్షణ భేరి స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. గంధం మణి, పెనగడం గురవయ్య, సంక్రాంతి వెంకటయ్య రాపూరు సుబ్రమణ్యం, రాజా, వెలివేంద్రం, వేణు గురునాథం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్: ప్రజాసమస్యలపై ఈనెల 15న జరిగే చలోవిజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం గూడూరు పట్టణంలోనీ అశోక్‌నగర్, అంబేద్కర్‌నగర్, శాంతినగర్, అరుంధతివాడ, శ్రామికనగర్ తదితర ప్రాంతాలలో ఇంటింటికీ తిరిగి ప్రజరక్షణ భేరి కరపత్రాలను పంపిణీ చేశారు. సీపీఎం సెంట్రల్ శాఖా కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు బివి. రమణయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి సురేష్, మణి, బి.చంద్రయ్య, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, మున్సిపల్ సంఘం నాయకులు గోపి పాల్గొన్నారు.

గూడూరులో కరపత్రాలు పంపణీ చేస్తున్న నాయకులు

కరువు కనబడటం లేదా జగనన్నా..!!

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి : ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడి, వ్యవసాయ రంగానికి మూలాధారమైన నీటి జాడ లేక రాష్ట్రం తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులలోకి నెట్టి వేయబడుతుంటే, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కరువు కనబడటం లేదా..? అని టీడీపీ నాయకుల మిన్నల్ రవి, డాక్టర్ ఉమేష్ రావు శనివారం ప్రశ్నించారు. అటు ఖరీఫ్ సీజన్లో కానీ, ఇటు రబీ సీజన్లో కానీ ఎన్నడూ లేనంతగా అత్యంత కనిష్ట స్థాయిలో వర్షపాతం నమోదైన విషయాన్ని భారత వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నా కూడా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వర్షాభావం కారణంగా నెలకొన్న కరువు ప్రాంతాల గుర్తించడంలో తీవ్రమైన నిర్లక్ష్యం చేయడం దారుణమైన విషయమని విమర్శించారు. రాష్ట్రంలో గత నలభై రోజులుగా సాధారణ సగటు వర్షపాతం ఉండాల్సి ఉండగా కేవలం 55 మి.మీ. మాత్రమే వర్షం పడటం కరువుకు నిదర్శనమన్నారు. కరువు మండలాలను గుర్తించడంలో అలసత్వం కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నదని, ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావం వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించే చర్యలు చేపట్టాలని ఉమేష్ డిమాండ్ చేశారు.

కుంటలను తలపిస్తున్న ఆర్ అండ్ బి రోడ్లు

- గుంతలమయమైన రోడ్లు - పట్టించుకోని అధికారులు



కాలేపల్లి వద్ద గుంతలమైన ఆర్ అండ్ బి రోడ్డు

ప్రజాశక్తి- రామచంద్రపురం: మండలంలోని ఆర్అండ్ బి రహదారులలో ప్రయాణం చేయడం అంటే నరకయాతనేనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అనుపల్లి- రాయలచెరువు, కుప్పంబాదురు- పరమాల నెత్తకుప్పం - ఎల్‌వి.పురం, తిరుపతి - పచ్చికాపలం ప్రధాన రహదారులు మరమ్మతులకు నోచుకోక గుంతలమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై వర్షపునీరు నిలిచిపోవడంతో మండలంలో ఆర్ అండ్‌బి రోడు కుంటలు తలపించేలా ప్రజలకు దర్శనమిస్తున్నాయి. అయినా ఆర్అండ్ బి అధికారులు పట్టించుకోక పోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారుల్లో ప్రయాణించాలంటే ప్రాణాలు చేతుల్లో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉందని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గత నాలుగున్నర సంవత్సరాలగా ఆర్అండ్ బి అధికారులు రోడ్లపై పడిన గుంతలు కూడా పూడ్చకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రమాదాల వల్ల సుమారు 10 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మండలంలో సూరవారిపల్లి, తిమ్మరాజు పల్లి, నెత్తకుప్పం, వేపకుప్పం గ్రామాల వద్ద ఆర్ అండ్ బి రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రహైవే అయిన తిరుపతి- పచ్చికాపలం ప్రధాన రహదారిపై కంకరు, మట్టి, ఇసుక లోడ్ టిప్పర్లు తిరగడం వల్ల రోడ్లు పూర్తిగా గుంతలమైపోయాయి. దీంతో అత్యవసర పనుల నిమిత్తం తిరుపతికి వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇకనైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్లను మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

అసమానతలు లేని అభివృద్ధి కోసం పోరాటం

ఎర్రజెండా ప్రజారక్షణ భేరి

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి- తిరుపతి సిటి: దేశంలోనూ, రాష్ట్రంలోనూ రానురాను పరిస్థితులు దారుణంగా తయారవుతున్నాయి. ప్రజాస్వామ్యమన్నది కనుమరుగువుతోంది. లౌకికవాదాన్ని మరిచిపోయారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, కర్షకులు, ఆడ, మగ, వృద్ధులు, పిల్లలు ఒకరేమిటి ప్రతి ఒకరు సమస్యల వలయంలో పడిలేస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి.. ధనవంతులకు పాలకులు తొత్తులుగా మారారు. దేశ సంపద మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగించేస్తూ, ప్రభుత్వరంగ సంస్థలన్నిటిని నిర్వీర్యం చేస్తూ, దేశాన్ని అదోగతిపాలు చేస్తున్న విషయం జగమెరిగిన సత్యం. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు, నిలదీసిన వారికి అరెస్టులు, ప్రభుత్వ సంస్థలైన ఈడీలు, సిఐడి, సిబిఐ అన్ని పాలకుల చేతుల్లో బొమ్మలుగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎవ్వరో వచ్చి మనల్ని ఉద్ధరిస్తారని చూసే కన్నా, మన బతుకులను, రాష్ట్ర, దేశ భవిష్యత్తును సక్రమ మార్గాన నడిపించేందుకు ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన కాలం వచ్చింది. అందర్ని ఐక్యం చేసేందుకు ఎర్రజెండా కదలింది. ప్రజారక్షణ భేరితో కదం తొక్కుతోంది. రాష్ట్రంలోనూ అదేపరిస్థితి.

రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్లు పూర్తి కావకస్తోంది. అప్పుడు మనకు అరచేతిలో స్వర్గం చూపించారు. కేంద్రంలోని బిజెపి నాయకులు. ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కుప్యాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజదాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, రైల్వేజోన్ వంటి విభజన హామీలలో ఏ ఒక్కటీ ఇప్పటి వరకు అమలు కాలేదు. రాష్ట్ర ప్రజల్ని మోసం చేసిన బిజెపి ప్రభుత్వం అంతటిదో ఆగకుండా రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి తయారు కావడం గమనార్హం. బిజెపి పాలనలో దేశమే అస్తవ్యస్తంగా తయారైంది. బిజెపి బుల్‌డోజర్ రాజకీయాలతో అన్నదమ్ముల్లా మెలగాల్సిన ప్రజల మధ్య విద్వేషాలు రాజేస్తోంది. బిజెపి పాలిత ప్రాంతాల్లో మైనార్టీలకు రక్షణ కరువైంది. స్త్రీలను నడిరోడ్డు మీద నగ్నం ఊరేగించి, సిగ్గులేకుండా అదేదో తమ ఘనత అన్నట్టు విర్రవీగుతున్నవారిని మోడీ ప్రభుత్వం సమర్థిస్తుండడం శోచనీయం. కోట్లాది మంది కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను తెచ్చింది. దేశీయ వ్యవసాయానికి, ప్రజల ఆహార భద్రతకు ముప్పు తెచ్చే నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చింది. రైతుల పోరాటంతో వాటిని రద్దు చేసింది. అర్ధాకలితో బతుకుతన్న వారు ప్రపంచంలోకెల్లా దేశంలోనే అధికంగా ఉన్నారంటే పరిస్థితి అర్థమవుతోంది. నిరుద్యోగం రికార్డుస్థాయిలో పెరిగిపోతోంది. ధరల పెరుగదలో సామాన్యుడి నడ్డి విరుగుతున్నా మోడీ ప్రభుత్వం మాత్రం భారత్ అబివృద్ధిలో ముందుకు పోతోంది అంటూ పచ్చి అబద్దాలను వల్లవేస్తోంది. రాష్ట్రంలోనూ పరిస్థితి అలానే తయారైంది. కృష్ణపట్టణం, గంగవరం మేజర్ పోర్టులను ఆదానికి నైవేద్యంగా అప్పగిస్తున్నారు. విద్యుత్ ఛార్జీలు చాపకింద నీరులా పెంచేశారు. స్మార్ట్‌మీటర్ల, మోటర్లకు మీటర్ల పేరుతో, ఆస్తి పన్ను నుంచి చెత్తపన్ను దాకా అన్ని వడ్డింపులతో ప్రజలపై భారాలు మోపుతున్నారు. సిఎంకు నవరత్నాలు తప్పా పెరిగిన ధరలు, నిరుద్యోగం, గిట్టుబాటు లేని వ్యవసాయం, రక్షణ కరువైన చేతివృత్తులు, కౌలురైతులు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదు. పైగా కరెంట్ చార్జీలు, ఇసుక ధరలు ప్రభుత్వమే పెంచింది. ఉపాధిని దెబ్బతీస్తున్నారు. చిన్న పరిశ్రమలు మూతబడ్డాయి. వైసిపి పాలనలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు. నిరసన కూడా తెలియజేయడానికి కూడా వీలు లేకుండా నిర్భందాలు, ముందస్తు అరెస్టులు, బైండోవర్ కేసులు బనాయిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షం టిడిపి కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట అనడం లేదు. పైగా వారిని పార్లమెంట్‌లో బలపరుస్తోంది. రాష్ట్రంలోని పోర్టులన్ని ఆదాని పరం చేసినా, విద్యుత్ ఛార్జీలు పెంచినా, ఉద్యోగుల పెన్షన్‌కి ఎసరు పెట్టినా, చంద్రబాబు నోరు విప్పడం లేదు. ఇక జనసేన పార్టీపరిస్థితి మరీ అన్యాయంగా తయరైంది. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి కూటమిలో ఉంటూ మోడీ నాయకత్వాన్ని సమర్థిస్తూ మన రాష్ట్రానికి ఏ విధంగా న్యాయం చేయగలదో ఆ పార్టీ నాయకత్వానికే తెలియాలి. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను, రాష్ట్రాన్ని పూర్తిగా గాలికొదిలేశాయి. ప్రధాన పార్టీలు తమలో తాము అధికారం కోసం కుస్తీలు పడుతున్నాయి. ప్రమాదంలో పడిన మన రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోలన్నా, సామాన్య ప్రజలకు నిజమైన ఊరట లభించాలన్నా ప్రజలే ఐక్యంగా కదలాలి. అప్పడే ప్రత్యేక హోదాను సాధించగలం. విశాఖ ఉక్కును కాపాడుకోగలం. విభజన హామీలు అమలు జరిగేటట్టు చూడగలం. అందుకు ఎర్రజెండా నడుంబిగించింది.

గతాన్ని ఒకసారి గమనం చేసుకుంటే విశాఖ ఉక్కు సాధన కోసం ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దు చేసినప్పుడు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసం, చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు బషీర్‌బాగ్ పోరాటంలో తెలుగవాడి సత్తా ఏమిటో చూపించాం. ఇప్పుడు అలాంటి మరోమహా ఉద్యమం అవసరం. అందుకే ప్రజారక్షణ భేరి. సిపిఎం ప్రజలను చైతన్యం చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్ర పేరుతో ప్రజారక్షణ భేరిని మ్రోగించింది. నాలుగు బృందాలుగా విడిపోయి ఈ బసుస యాత్ర రాష్ట్ర నలుమూలల పర్యటిస్తోంది. అందులో భాగంగా గత వారం ఈ యాత్ర మూడురోజుల పాటు తిరుపతి జిల్లాలో సైతం సాగింది. ఈ యాత్ర నవంబరు 15వ తేదీకి విజయవాడకు చేరుకుంటాయి. అదేరోజు భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలందరూ ఈ సభకు తరలివచ్చి ప్రజావ్యతిరేక ప్రభుత్వాలకు తగిన విధంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

అత్యాధునిక వైద్యం 'యష్'లో లభ్యం





ప్రజాశక్తి- తిరుపతి సిటి: సరికొత్త సాంకేతిక పరికరాలతో, అత్యాధునిక పద్ధతుల్లో అన్ని రకాల వ్యాధులకు నాణ్యమైన వైద్యాన్ని 'యష్' మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో అందిస్తున్నట్లు ఆ ఆసుపత్రి అధినేతలు ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టరు రాజ్ యశ్వంత్, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టరు జి.రమ్య తెలిపారు. స్థానిక శ్రీనివాసం కాంప్లెక్స్ పక్కవీధిలోని డిపిఆర్ ఫంక్షన్ హాల్‌కు ఎదురుగా వాసవి శ్రీటవర్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన యష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద డాక్టరు యశ్వంత్ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ తిరుపతి దినదినాభివృద్ధి చెందుతుంది. ఆధ్యాత్మికపరంగానే కాదు, ఇటు విద్యారంగంలోనూ ఎదుగుతూ, హెల్త్ హాబ్‌గా మారుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని తాను పుట్టిపెరిగిన ప్రాంతానికి తమవంతు సహాయం చేయాలనే ఆలోచనతో అంతర్జాతీయ ప్రమాణాలతో యష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను స్థాపించామన్నారు. వైద్యవృత్తిలో కొనసాగుతున్న తన తండ్రి డాక్టరు వి.కృష్ణమూర్తి ప్రోత్సహంతో వైద్యరంగంలోకి ప్రవేశించానన్నారు. తనతోపాటు కొంత మంది బంధువులు, మిత్రుల సహాయంతో మల్టీ స్పెషాలిటీని ఏర్పాటు చేసి సుమారు 11 వైద్యవిభాగాలకు చెందిన చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ప్రారంభించిన అతితక్కువ కాలంలోనే ప్రజామన్నలను పొందుతూ ముందుకెళ్లుతున్నామని వెల్లడించారు. కంటి వైద్య విభాగంలో అనుభవం గడించిన తను తన తండ్రి సహాకారంతో అన్ని రకరాల కంటి సమస్యలకు అత్యాధునిక పద్ధతుల్లో వైద్యం అందిస్తున్నానని తెలిపారు. తనతో పాటు గైనకాలజిస్టు డాక్టరు జి.రమ్య ఆధ్వర్యంలో గర్భవతులకు, బాలింతలకు, మహిళ ఎదుర్కొంటున్న వైద్యసమస్యలకు చికిత్స అందిస్తున్నామని, డాక్టరు వి.నవ్య ఆధ్వర్యంలో సంతానలేమి దంపతులకు అత్యాధునిక వైద్యం అందించేందుకు పెర్టిలిటీ క్లీనిక్‌ను ఏర్పాటు చేశామన్నారు. డాక్టరు మానస ఆధ్వర్యంలో చిన్నపిల్లలు ఆరోగ్య సమస్యలకు, డాక్టరు శోభారాణి ఆధ్వర్యంలో జనరల్ సర్జరీ చికిత్సలు, డాక్టరు సాగర్ ఆధ్వర్యంలో దంత సమస్యలకు చికిత్స, డాక్టరు వాణి ఆధ్వర్యంలో ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్ వంటి వైద్యపరీక్షలను అత్యాధునిక సాంకేతిక పరికరాలతో అందిస్తున్నామన్నారు. తిరుపతిలో అన్ని రకాల వైద్యసేవలు ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను స్థాపించామన్నారు. విశాలమైన హాస్పిటల్ భవనం, సరికొత్త వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సులు, ఆసుపత్రి సిబ్బందితో రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అతితక్కువ ఫీజులతో అందిస్తూ, రోగులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. రోగులు, వారి కుటుంబ సభ్యులు తమ ఆసుపత్రిని సంప్రదించాలని, వివరాలకు 87148 38714, 0877 2238714 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

డాక్టరు రాజ్ యశ్వంత్

ప్రత్యేకతలు

- ఆప్తమాలజీ వైద్యసేవలు.
- గైనకాలజీ, పెర్టిలెటీ క్లీనిక్.
- లాసిక్, ఫిడియాట్రిక్స్.
- జనరల్ సర్జరీ, డెంటిస్టు.
- జనరల్ మెడిసిన్.
- అత్యాధునిక క్లీనికల్ ల్యాబోరేటరీ.
- ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కాన్ కేంద్రం.
- ప్రీమియం ఆప్టికల్ స్టోర్.
- 24 గంటలు అత్యవసర వైద్యసేవలు.
- అత్యాధునిక వైద్య పరికరాలు.
- అనుభవజ్ఞులైన వైద్యులు, వైద్యసిబ్బంది.

సీటీ స్కాన్ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి : స్థానిక ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్ ఏర్పాటు చేయాలని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను హెల్త్ అండ్ ఫుడ్ సేఫ్టీ ఏపీ కో- ఆర్డినేటరు హరీష్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వైసీపీ కార్యాలయంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సిటీ స్కాన్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ వినియోదారుల హక్కుల కమిషన్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిప్యూటీ చైర్మన్లు కోటేశ్వరబాబు, వినుకొండ మాధురి, స్టేట్ కో- ఆర్డినేటర్ వెంకట కిషోర్, ఆర్టీఐ ఇన్చార్జ భరత్ కుమార్ నాయుడు, స్టేట్ మెడికల్ ఆఫీసర్ హరీష్ పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటాం..

- ఏనుగుల దాడులకు అడ్డుకట్ట - రూ.25 లక్షలతో కందకాలు తవ్వకం
- పంట నష్ట పరిహారానికి చర్యలు తీసుకుంటాం
- బాధిత రైతులకు తుడా ఛైర్మన్ మోహిత్ రెడ్డి హామీ

ప్రజాశక్తి- పాకాల: 'ఏనుగులు దాడి చేసి పంటలను ధ్వంసం చేశాయని అధైర్యపడకండి.. మీకు అండగా నిల బడతాం.. ఏనుగుల దాడులకు అడ్డు కట్ట వేసేలా 25 లక్షల రూపాయలతో కందకాలు తవ్విస్తాం..' తుడా ఛైర్మన్, చంద్రగిరి నియోజక వర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్ రెడ్డి సంబంధిత రైతులకు హామీ ఇచ్చారు. ఏనుగుల దాడిలో నష్టపోయిన సంబంధిత రైతులను శనివారం మండలంలోని ఈ పాల గుట్టపల్లి, పుదుపట్ల బైలు, పేరసానిపల్లి గ్రామాలలో ఏనుగుల దాడిలో నష్టపోయిన రైతులను పరామర్శించారు. అటవీ ప్రాంతం నుంచి పంట పొలాలపైకి ఏనుగులు వచ్చే దారులను డ్రోన్ కెమెరాలతో గుర్తించి కందకాలు తవ్విస్తామని, ఏనుగులను దారి మళ్లించేందుకు వీలుగా వీలైనంత ఎక్కువ మంది ట్రాకర్లను నియమిస్తామని తుడా ఛైర్మన్ మోహిత్ రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను జిల్లా అటవీ శాఖ అధికారితో కలసి పరిశీలించారు. వారందరికీ వీలైనంత త్వరగా నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని తుడా ఛైర్మన్ మోహిత్ రెడ్డి బాధిత రైతులకు హామీ ఇచ్చారు. పాకాల మండలం లో పాలగుట్టపల్లి, పదిపుట్లబైలు, పేరసానిపల్లి పంచాయతీల పరిధిలో వారం రోజులుగా ఏనుగుల గుంపు పంట పొలాలను ధ్వంసం చేస్తుండటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరి, అరటి, కూరగాయల పంటలు ధ్వంసం చేసిన ఏనుగులు ఊర్లలోకి కూడా చొరబడుతుండటంతో సమాచారం తెలుసుకున్న తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అటవీ అధికారులను వెంటబెట్టుకుని శనివారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. డీఎఫ్ వో సతీష్ కుమార్ రెడ్డితో పాటు ఎఫ్ఆర్వో మాధవీలత తమ సిబ్బందిని వెంట బెట్టుకుని ఏనుగులు ధ్వంసం చేసిన పంట పొలాలను సందర్శించి రైతుల వివరాలు సేకరించారు. అనంతరం ఏనుగులు వస్తున్న సమయం, ఎటువైపు నుంచి వస్తున్నా యన్న వివరాలను సేకరించి ఆయా ప్రాంతాల్లో ట్రాకర్లు ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. ముందు ఆ పాలగుట్టపల్లికి చేరుకుని అక్కడి రైతులతో మాట్లాడిన మోహిత్ రెడ్డి ఆ తర్వాత తోటపల్లి, పదిపుట్లబైలు, పెరుమాల్ గుడి ప్రాంతాల్లో రైతులను కలుసుకుని ధైర్యం చెప్పారు.

కందకాలు తవ్వకానికి రూ.25 లక్షలు

ఏనుగుల గుంపు అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చే మార్గాల్లో కందకాలు తవ్వించి పటిష్టమైన రైలింగ్‌ను ఏర్పాటు చేయడానికి మొదటి విడత రూ.25 లక్షలు ఖర్చు చేసేలా నిర్ణయం తీసుకున్నట్లు మోహిత్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. అడవి లోపల నుంచి బయ టకు వచ్చే ఏనుగుల గుంపును ముందుగానే పసిగట్టి దారి మళ్లించేలా డ్రోన్ కెమెరాలను కూడా వినియోగించనున్నట్లు స్పష్టం చేశారు. గత వారం రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న ఏనుగు ల గుంపును దారి మళ్లించి పంటను కాపాడుకునేందుకు రైతులు అందరూ సంఘటితంగా పోరాడాలని, ఎవ్వరికి వారు టపాకాయలు పేల్చి పక్క ఊర్లకు మళ్లించే ప్రయత్నం చేయకూడదని సూచించారు. అలా చేయడం వల్ల ఎక్కువ మంది నష్టపోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు. అంతే కాకుండా రుచికరమైన ఆహారం దొరికితే ఏనుగులు ఆ ప్రాంతంలోనే తిష్టవేసేందుకు అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఈ గతంలో ఎన్నడూ ఏనుగులు ఇటువైపు వచ్చిన దాఖ లాలు లేకపోవడంతో తమ సిబ్బంది కూడా వాటిని దారి మళ్లించేందుకు ఇబ్బంది పడ్డారని, అయితే వీలైనంత ఎక్కువ మంది సిబ్బందిని ఏర్పాటు చేసి పంట పొలాలపైకి రాకుండా దారి మళ్లించే చర్యలు తీసు కుంటామన్నారు. ఒంటరి ఏనుగు కనబడినప్పుడు రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలని, గుంపుగా వచ్చినప్పుడు అవి జనంపైకి వచ్చే అవకాశం ఉండదన్నారు. చివరగా ఏనుగులను దారి మళ్లించే ట్రాకర్లను అప్రమత్తం చేసి రైతులతో కలిసి సమస్యను ఎదుర్కోవాలని సూచించారు.

రైతులతో చర్చిస్తున్న తుడ ఛైర్మన్ మోహిత్‌రెడ్డి

ఆరు రోజుల శిక్షణ ముగింపు

ప్రజాశక్తి - క్యాంపస్: 2026 -27 నాటికి మూడో తరగతి చదివే ప్రతి విద్యార్థి స్పష్టంగా చదవడం, రాయడం గణిత ప్రక్రియలు సాధించే దిశగా ప్రతి ఉపాధ్యాయుడు మిషన్ మోడ్ లో పనిచేయాలని డీఈవో డాక్టర్ శేఖర్ అన్నారు. విశ్వం హైస్కూల్ తిరుపతిలో చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల నుండి మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి డిపార్ట్మెంట్, పాఠశాల విద్యాశాఖ నుండి ఎంపికైన డిఆర్పిలకు ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరానికి రాష్ట్ర పరిశీలకులుగా డాక్టర్ పెంచలయ్య హాజరయ్యారు. మూడు జిల్లాల నుండి 200 మంది హాజరైన ఈ శిక్షణ ముగింపు కార్యక్రమంలో తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ "భాష , గణితంలో పునాది అభ్యసన పటిష్టంగా ఉంటే విద్యార్థి అన్ని విషయాలు నేర్చుకోవడం సులభతరం అవుతుందన్నారు. పాఠశాల సంసిద్ధత మేళా, బోధన అభ్యసన కృత్యాల నిర్వహించడం ద్వారా విద్యార్థులకు బడి పట్ల ఆసక్తిని కలిగించి పాఠశాల వాతావరణంకు అలవాటు పడడానికి సహాయపడుతుందని ట్రైనింగ్ లో నేర్చుకున్న విషయాలను పాఠశాల స్థాయిలో అమలుపరచి విద్యార్థులలో పునాది అభ్యసనం, గణిత ప్రక్రియల సాధనకు కృషి చేయాలని, విద్యార్థులలో సాంకేతికను జోడించి తరగతిగదిని ఆహ్లాదకరంగా మార్చుకోవాలని తద్వారా విద్యార్థులలో చదువు పట్ల ఆసక్తిని పెంపొందింపజేయాలని జిల్లా అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ శివ శంకరయ్య డిఆర్పిలను కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వం స్కూల్ అధినేత విశ్వనాథ్ రెడ్డి పాల్గొని పలువురు కె ఆర్ పి లను దుశ్శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుష్ప, మధు, సూపరింటెండెంట్ రోహిణి భాయ్, రాజారామ్, కేఆర్పీలు అనిత , పద్మజ , నరసయ్య, సంస్థ కోఆర్డినేటర్లు చందు, గోపికృష్ణ, మురళి, గణేష్, శ్రావణి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

బాలల ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బాలల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట మండలం కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకొని ప్రజాశక్తి పిల్లల ప్రత్యేక సంచిక చిరుమువ్వలు పుస్తకాన్ని శనివారం ఉదయం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే పుష్పలత, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, ప్రజాశక్తి జిల్లా బ్యూరో ఇన్‌చార్జి గోపి, జిల్లా ఇన్‌చార్జి పి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దండు రామచంద్రయ్య, ఉపాధ్యాయులు మురళి, రవీంద్ర ,రాధాకృష్ణ , అబ్దుల్ రఫీక్, ప్రజాశక్తి సిబ్బంది కే గురవయ్య, ఎం సురేష్, జి మునిమోహన్, విలేకరి సుధీర్ పాల్గొన్నారు. అనంతరం యుటిఎఫ్ ఆధ్వర్యంలో మండలం లోని ఉన్నత పాఠశాలల గ్రంథాలయాలకు ఈ ప్రత్యేక సంచిక అందిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కే ముత్యాల రెడ్డి తెలిపారు.

ప్రజలకు ఎమ్మెల్యే దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రజలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఓ ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్టశక్తులపై సాధించిన విజయాలకు ప్రతీకగా దీపావళి జరుపుకుంటామని వివరించారు. ఈ పండుగ ప్రజలందరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలని ఆకాంక్షించారు. దీపావళి పర్వదినం సందర్భంగా ప్రజలం దరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని, దివ్వెల వెలుగులలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో విరాజిల్లాలని అభిలషించారు.

పాలస్తీనాకు మద్దతుగా సిపిఎం సంఘీభావ నిరసన

ప్రజాశక్తి -రేణిగుంట: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని.. సామ్రాజ్యవాద అమెరికా పెత్తనం నశించాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని రేణిగుంట సిపిఎం నాయకులు డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం అంబేద్కర్ విగ్రహం వద్ద పాలస్తీనాకు మద్దతుగా సంఘీభావ నిరసన తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇజ్రాయిల్‌కు ఇస్తున్న మద్దతును వెంటనే విరమించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, సిపిఎం నాయకులు వెంకట రమణ, ఆవాజ్ నాయకులు దిలీప్ బాష, సెల్వరాజ్, ఈశ్వరి, సరస్వతి, సుజాత, మహాలక్ష్మమ్మ, కుప్పస్వామి, పద్మమ్మ, వెంకటరమణ, శివానందం, సిఐటియు జిల్లా నాయకులు ముని రాజా, జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, సిపిఎం మండల కార్యదర్శి హరినాథ్ పాల్గొన్నారు.

సైరో క్రాకర్స్‌లో సరసమైన ధరలకే టపాకాయలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మా సిటీ సైరో క్రాకర్స్ లో సరసమైన ధరలకే అంది స్తున్నటు ఆ సంస్థ నిర్వాహ కులు శ్రీధర్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రజాశక్తితో మాట్లా డుతూ మంగళం రోడ్డులో (శ్రీవారి పాదాల చెంత టపాకాయలు మా సిటీ క్రాకర్స్‌లో విక్రయిస్తు న్నామ న్నారు. 2009లో టపా కాయల దుకాణం ఏర్పాటు చేసినప్పటి నుంచి 14 సంవత్సరాలుగా అందరి మన్ననలు పొందుతూ తిరుపతి, తిరుపతి చుట్టుపక్క ప్రాంతాల వారికి టపాకాయలను సరమైన ధరలకు, మన్నికైన నాణ్యత పాటిస్తూ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా టపాకాలయలను విక్రయి స్తున్నామన్నారు. మనకు దీపావళి ఒక సంవత్సరంలో కేవలం 2 రోజులు మాత్రమే మన సంతోషం కోసం తమిళనాడు రాష్ట్రంలోని శివకాశీ ప్రాంతంలోని పేద ప్రజలు మనకోసం ప్రాణాలు సైతం పణంగాపెట్టి సంవత్సరమంతటా టపాసుల తయారీలో పాల్గొని మనకు దీపావళి నాటికి సరికొత్తగా అందచందాలతో మనకు టపాసులు అందిస్తున్నారన్నారు. సరికొత్త వెరైటీలతో ప్రతి సంవత్సరం మన కుటుంబ సభ్యుల ఆనందం కోసం టపాకాయలు తయారు చేస్తున్నారని, శివకాశి, పరిసర ప్రాంతాలలో కార్మికు లందరూ ఈ టపాకాయలు తయారు చేయడం కోసం శ్రమి స్తున్నారన్నారు. వీరి శ్రమని గుర్తించి ఈ టపాకాయలు మరింత ఎక్కు వుగా కొనుగోలు చేసి వారి ఆర్థికంగా తోడ్పడాలని పేర్కొన్నారు. ప్రత్యేకంగా తమ దుకాణంలో కారు పార్కింగ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. షాపు దగ్గర నాణ్యత, జాగ్రత్త లు పాటి స్తున్నా మన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసు కోవాలని కోరుతున్నామన్నారు. 9494855311 ఫోన్ నెంబ రును సంప్రదించాలన్నారు.



టపాకాయలు పేల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి: సిఐ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: దీపావళి సందర్భంగా టపాకాయలు పేల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సిఐ విక్రమ్ పేర్కొన్నారు. ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపావళి పండగ సందర్భంగా ప్రజలు టపాకాయలు పేల్చే సమయంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం ఉండకూడదని, వారి వారి ఇళ్ల వద్ద టపాసులు పేల్చే సమయంలో పక్కనే నీళ్లను కచ్చితంగా ఉంచుకోవాలని, ధరించే గుడ్డలు నిప్పును ఆకర్షించేవి లేకుండా చూసుకోవాలని సూచించారు. అన్నిటికంటే ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో గడ్డి వాములు, పూరి గుడిసెలు ఉన్నచోట కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు టపా కాయల దుకాణాల వద్ద ఎలాంటి ప్రమాదకర ఘటనలు చోటుచేసు కోకుండా పర్యవేక్షిస్తున్నామని ప్రజలు సుఖ సంతోషాలతో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పండుగను జరుపుకోవాలన్నదే పోలీసు శాఖ ఉద్దేశమని తెలిపారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

- సిఐటియు తిరుపతి జిల్లా ఆటో కార్మికుల సంఘం అధ్యక్షులు బివి రమణయ్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్: ఈ నెల 15వ తేదీ చలో విజయవాడను ప్రచారం చేయాలని కోరుతూ స్టిక్కర్లను శనివారం గూడూరు పట్టణంలోని ఆటోస్టాండ్ లో ఆసంఘం అధ్యక్ష, కార్యదర్శుల సమక్షంలో జిల్లా అధ్యక్షులు బివి రమణయ్య ఆధ్వర్యంలో ఆటోలకు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాలైన టూ ఆఫ్ చార్జీలు, సర్వీసు చార్జీలు, పెట్రోలు, డీజిల్ ధరలు, నిత్యావసర ధరలు అనేక రకాలుగా ప్రజలపై భారాలు మోపుతూ ప్రజలను ఇబ్బందు లకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజ నాలను, ప్రజల డిమాండ్లను, ప్రజా ప్రణాళికగా సిపిఎం ముందు కు తీసుకొచ్చిందన్నారు. ఈ నెల15వ తేది విజయవాడలో ప్రజా రక్షణ భేరి భారీ బహిరంగ సభ, ర్యాలీ నిర్వహించనున్నారని, సిపిఎం చేపట్టిన, ఈ ప్రజా రక్షణ భేరి సభకు తిరుపతి జిల్లా ప్రజలు, ప్రజా సంఘాలు, అభిమానులు తరలి వచ్చి విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి బి రమేష్, మార్కెట్ స్టాండ్ అధ్యక్షులు వి కోటయ్య, పట్టణ కమిటీ సభ్యులు ఎస్కె మున్నా, ఎస్కె రఫీ, కాసిం భాయ్, ఎస్కె ఆసిమ్, ఆర్ శీను, పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆటో కార్మికుల సంఘం జిల్లా నాయకులు నాయకులు బివి రమణయ్య

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

తిరుపతి టౌన్: దేశ సాంస్కృతిక సంప్రదాయాలను సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతులు చేస్తూ దేశసమ గ్రతకు, అందరికీ ఉన్నత విద్య అందించేందుకు పాటుపడిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత, మున్సిపల్ కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు ఇమామ్, కార్పొరేటర్ నరేంద్ర, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నరేంద్ర, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఆర్ఓ సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, మున్సిపల్ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని గూడూరులోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, స్వచ్ఛ ఆంధ్ర చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ, నాయకులు కలిసి పూలమాలలువేసి నివాళి అర్పించారు. దేవసేనమ్మ మాట్లా డుతూ ప్రజలకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలిపా రు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్, బొమ్మిడి శ్రీనివాసులు ,అజీజ్ ఖాన్, సతీష్ రెడ్డి, భాస్కర్ గౌడ్, సురేష్ రెడ్డి, సాయి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘం కార్యదర్శి కృపావరమ్మకు సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విశ్రాంత ఉద్యోగుల పుత్తూరు శాఖలో కార్యదర్శి గా సేవలు కొనసా గించిన కృపావరమ్మ అనతి కాలంలోనే జిల్లా కార్యదర్శి గా ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం ఆమె సేవా తత్పరతకు నిదర్శనమని గౌరవ అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి అన్నారు. ఉద్యోగ రీత్యా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గా పని చేసి పదవీ విరమణ అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం లో అంచలంచెలుగా ఎదిగిన కృపావరమ్మకు సన్మానం నిర్వహించారు. గుణశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంకిత భావం తో చేసే అలుపెరగని సేవ ప్రశంసనీయమని, ఎందరికో ఆదర్శం అన్నారు. కుటుంబ సభ్యులు కూడా కృపావర మ్మను సత్క రించారు. ఇటీవల రాష్ట్ర ఖజానా సంచాలకులు ఆదేశాల మేరకు ఉప ఖజానా అధికారి నిర్వహించిన కో ఆర్డినేషన్ సమావేశం లో మన సంఘం సభ్యుల సమస్యల మెమొ రాండం ను సమర్పిం చారని అధ్యక్షు లు భాస్కర్‌రాజు తెలిపారు. ఫ్యామిలీ పెన్షనర్స్ పుట్టిన తేదీ లలో మార్పులు చేర్పులు కోసం ప్రత్యేక దరఖాస్తు లో బాధితుల నుండి సేకరిం చారు. సంఘ సభ్యులు అరుణాచలం సేవలను గుర్తించి అసోసి యేటెడ్ అధ్యక్షులుగా భాస్కర రాజు సంఘ అధ్యక్షులు అంద రి ఆమోదం తో నియమించారు. ఈ కార్యక్ర మంలో కుప్ప య్య, రామలింగం, యుగంధర్, కృష్ణమ నాయుడు, సుబ్రమణ్యం, అరుణాచలం, నిర్మల, లలిత, సుశీల, రాజీమమూర్తి, రామచంద్ర, రమేష్ వెంకట కృష్ణ, చంద్రశేఖర్, మార్టిన్,వేలు , మురళి పాల్గొన్నారు.

కృపావరమ్మను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

అమర హాస్పిటల్లో ఇంట్రావాస్కులర్ అల్ట్రాసౌండ్ చికిత్స

ఏడుగురికి విజయవంతం

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ లోని అమర హాస్పిటల్‌లో ఇంట్రా వాస్కులర్ అల్ట్రా సౌండ్ అనే అధునాతన పరికరం సహాయంతో గడిచిన నెలలో ఏడు గురికి చికిత్స అందించి విజయవంతంగా డిశ్చార్జ్ చేశామని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శివకృష్ణ సీఏవో వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంట్రావాస్కులర్ అల్ట్రాసౌండ్ (ఐవియుఎస్) అనేది కొరోనరీ ఆర్టరీ లోపలి భాగాన్ని వీక్షించడానికి ఉపయోగించే కాథెటర్-ఆధారిత రోగనిర్ధారణ ప్రక్రియ, ఇది నిజ-సమయ వీక్షణను అందిస్తుందని ఈ అత్యాధునిక పరికరం చెన్నై, బెంగళూరు, హైదరాబాదు లాంటి సిటీలలో మాత్రమే పరిమితమై ఉండేదని, కానీ ఇప్పుడు తిరుపతిలోని అమర హాస్పిటల్ లో అందుబాటులో ఉండటం ఎంతో సంతో షకరమైన విషయం అన్నారు. ఈ పరిజ్ఞానం ద్వారా గుండె రక్తనాళాన్ని అల్ట్రాసౌండ్ ద్వారా పరీక్షి స్తుందని, రక్త నాళం పరిమాణం దానిలోని కొలెస్ట్రాల్ తీరు తెన్నులు తెలుసు కోవచ్చన్నారు. అంతేకాకుండా స్టంట్ చేసిన తర్వాత అది సరైన పద్ధతిలో జరిగిందా.. లేదా? తెలుసు కోవచ్చన్నారు. స్టంట్ జీవితకాలం (పెటెన్సీ రేట్) పెరుగుతుందని, సిఏబిజి అవసరమైన పేషెంట్స్‌కు కూడా కొంతమందికి సిఏబిజి అవసరం లేకుండా స్టంట్ తో సరి చేయవచ్చని తెలిపారు.

ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు కృషి: జనసేన

ప్రజాశక్తి -గూడూరు రూరల్: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టిడిపి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా జనసేన శ్రేణులు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిత్తలూరు సుందర్ రామిరెడ్డి పేర్కొన్నారు. తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని జనసేన నియోజవర్గ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని పట్టణ, మండల అధ్యక్షులు, లీగల్ సెల్, ఐటీ విభాగం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తనపై ఉన్న నమ్మకంతో తనకు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పదవి ఇచ్చారని ఆయన నమ్మకాన్ని నిలబెట్టేందుకు పార్టీ బలోపేతానికి పాటుపడతానని పేర్కొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని అన్ని నియోజక వర్గాల్లో పర్యటిస్తారని అందులో భాగంగా మొదట గూడూరులో పర్యటిస్తున్నట్లు ఆయన తెలిపారు. గూడూరు నియోజకవర్గంలో పార్టీ అధిష్టానం ఇచ్చే సూచనలతో తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల, వార్డు, కమిటీలు పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయన్నారు. టిడిపి నాయకులతో సమన్వయం చేసుకొని రాబోయే ఎన్నికల్లో జనసేన, టిడిపి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడే విధంగా కృషి చేయాలని కోరారు. జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ పార్టీ పెద్దల సూచనలు, సలహాలతో నియోజవర్గ పరిధిలో జనసేన కమిటీ సభ్యులతో సమన్వయ పరచు కుని పార్టీ బలోపేతానికి పని చేస్తామన్నారు. గ్రామీణ, మండ ల స్థాయిలో జనసేన నాయ కులు, టిడిపి నాయకులతో కలిసి మెలిసి కేంద్ర కమిటీ ఆదేశించిన కార్యక్రమాలను విజయ వంతం చేయా లని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గూడూ రు పట్టణ, మండల, కోట, వాకా డు, చిట్టమూరు అధ్యక్షులు పెద్దిశెట్టి ఇంద్రవర్ధన్, పాలిచర్ల భాస్కర్, దామ రాపు బాలసుబ్రమణ్య, రౌతు శివ, గుండుబోయిన వాసు, నెల్లూరు రూరల్ నాయకులు కన్నా, మోహన్, చంద్రశేఖర్, గూడూరు నాయకులు రాజశేఖర్, విజయ్, నాగార్జున, అక్బర్, క్రాంతి, వంశీ, కార్తీక్, ఓంకార్, మణి, మస్తాన్, లీగల్ సెల్ సభ్యులు మోహన్, సుమన్, రఘు,ఐటీ వింగ్ స్వరూప్, మహేష్, యస్వంత్ పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జనసేన కార్యకర్తలు

క్రికెట్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

క్రికెట్ కిట్లు వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని అల్లూరి ఆదిశేషారెడ్డి స్టేడియంలో క్రీడాకారులకు 50 వేల రూపాయతో క్రికెట్ కిట్లును ఎమ్మెల్యే వరప్రసాద్ రావు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే శరీరాన్ని కంట్రోల్‌లో ఉంచుకునే వారే ఆరోగ్య వంతులుగా ఉంటారని పేర్కొన్నారు. గ్రౌండ్‌లో నిత్యం వాకింగ్ చేసే వారందరూ చాలా ఆరోగ్యంతో ఉన్నారన్నారు. గూడూరు గ్రౌండ్ లోని క్రికెట్ క్రీడా కారులు సాయం కోరడంతో క్రీడాకారులకు తన వంతు సహాయం అందించడంలో చాలా ఆనందంగా ఉందన్నారు. గ్రౌండ్‌లో ఓ పక్క స్కేటింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని, గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న మహిళలకు వాష్ రూమ్స్ ఏర్పాటు చేస్తామని, గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న వాకర్స్, క్రీడాకారులు కోరిన విధంగా ఇంకా ఎప్పటికీ గ్రౌండ్‌లో టపాసుల దుకాణాలకు అనుమతి లేకుండా వుండేలా ప్రభుత్వం నుండి జీవో తీసుకువస్తానని తెలిపారు. ఈయన వెంట పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, గూడూరు రూరల్ మండలం ఎంపీపీ గురవయ్య, సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, కొండూరు సునీల్ రెడ్డి, వైసీపీ నాయకులు మహేంద్ర యాదవ్, కొట్టు అశోక్ , పలువు రు ప్రముఖులు, క్రీడాకారులు ఉన్నారు.

ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓం శ్రీ సాయి రాం వృద్ధాశ్రమంలో శనివారం అన్నదా నం నిర్వహించారు. ఈ కార్యక్రమం మెడనూరు సురేష్ రెడ్డి , శాంతి దంపతుల ఆర్థిక సాయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహన్ రావు, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, గ్రానైట్ ప్రభాకర్, ప్రభాకర్, కోట వెంకటేశ్వర్లు, వాచ్ షాప్ రాము, కుమార్ నాయుడు, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, కృష్ణారెడ్డి, ప్రసాద్, నిర్వాహకురాలు కళ్యాణి పాల్గొన్నారు.

పర్యావరణానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దీపావళి పర్వ దినాన్ని పురస్కరించుకొని పర్యా వరణానికి హాని కలగని టపాకాయలను ప్రజలు వినియోగించి పర్యావరణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా తగిన తోడ్పాటును అందించాలని కాలుష్యం నియంత్రణ మండలి తిరుపతి ప్రాంతీయ అధికారి నరేంద్రబాబు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఘనంగా బర్సి భోగ బండారం ఉత్సవాలు విజయవంతం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో బంజారా(లంబాడి) జాతి సంప్రదాయ బద్ధంగా దర్శి భోగ బండారు ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించారు. హతిరాంజి బావాజీ బర్సి ఉత్సవ కమిటీ వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన లంబాడాలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. లంబాడా నృత్యంతో ఊరేగింపు భక్తి రసంగా సాగింది. అనంతపురం సేవా ఘాడ్ నుంచి అఖండ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా హతిరాంజి బావాజీ బర్సి ఉత్సవ కమిటీ కన్వీనర్ శివ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నుంచి పెద్ద సంఖ్యలో బంజారా ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం ఆనవాయితీ అని చెప్పారు. లంబాడాల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి నృత్యాలు నగరంలో పలువురికి ఆకట్టుకున్నాయి. గణపతి, మాజీ ఐపీఎస్ అధికారి డిటి నాయక్, మాజీమంత్రి జగన్నాథ నాయక్, బాబా రామ్ బావన్, ఆచార్య సీతారాం పాల్గొన్నారు.



మంత్రి రోజాకు సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రాష్ట్ర పర్యాటక, సంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కెరోజా కళ్యాణ మండపం, వృద్ధాశ్రమం , కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించడం పట్ల వన్నెకుల క్షత్రియ సంఘం నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. వన్నెకుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో కళ్యాణ మండపం, వృద్ధాశ్రమం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం పుత్తూరు గ్రామీణ మండలం నేసనూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 210/2 సర్వే నెంబర్ లో 1.04 ఎకరాల్లో స్థలాన్ని కేటాయించారు. రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా వినతి చేయడంతో ఈ మేరకు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.అనంతరామ్ ఆదేశాలు జారీ చేశారు. వన్నె కుల క్షత్రియ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ నగరి లోని మంత్రి కార్యాలయంలో రోజాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వన్నెకుల క్షత్రియ సంఘం నాయకులు, వైసిపి అభిమానులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కారు మోటార్ సైకిల్ ఢీ

చిన్నారి మృతి, ఇద్దరికీ తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కారు మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో చిన్నారి మృతి చెందగా, తండ్రి, మరో చిన్నారికి తీవ్ర గాయాలయిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు..పుత్తూరు పట్టణ గేటు వీధిలో నివసిస్తున్న సతీష్ (41) వారి ఇద్దరి పిల్లలు హరిప్రియ (ఒకటిన్నర సంవత్సరం) వీరు ముగ్గురు శనివారం ఉదయం మోటార్ సైకిల్ పై జాతీయ రహదారి విజయబాబు హోటల్ వద్ద వెళుతుండగా వెనుక నుంచి చెన్నై నుంచి వస్తున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో చిన్నారి మృతి చెందింది. తండ్రి సతీష్, హరిప్రియకు తలపై గాయాల అయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి గాయపడిన వారిని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. రక్షిత మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం అతని బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలత్తూరు టిడిపి మాజీ ఎంపిటీసీ మృతి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిటీసీ, అలత్తూరు గ్రామ కమిటీ అధ్యక్షులు గోపి కృష్ణ శనివారం మధ్యాహ్నం హఠాత్తుగా మృతి చెందారు. మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని, పార్టీకి తీరని లోటు అని, మండలంలో టిడిపి కుటుంబ సభ్యులందరూ ఆదివారం ఉదయం 9 గంటలకు ఆలత్తూరులో గోపి కృష్ణ భౌతిక కాయానికి నివాళులు అర్పించాలని బుచ్చినాయుడు కండ్రిగ టిడిపి మండల ప్రసిడెంట్ సుధాకర్ నాయుడు పేర్కొన్నారు.

చంద్రమోహన్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రముఖ నటుడు చంద్ర మోహన్ మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సంతాపాన్ని వ్యక్తం చేశారు. హీరోగా, క్యారెక్టర్‌ఆర్టిస్టుగా, కమెడియన్‌గా 932 చిత్రాలలో నటించి నంది, ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు. ఆయన మృతి తెలుగు చిత్ర రంగానికి తీరని లోటన్నారు. ఆయనకుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బాబుతో రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ: టిడిపి

ప్రజాశక్తి-తొట్టంబేడు: చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు అన్నారు . మండలంలోని రౌతు సూరమాల, లింగమనా యుడుపల్లి పంచాయతీల్లో బాబు ష్యూరిటీ..భవిష్యత్ గ్యారెంటీని నిర్వహించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలు కల్పించే బాధ్యత తాము తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కన్నలి రత్నయ్య, ఘట్టమనేని శంకర్ నాయుడు, నెలబల్లి సునీల్ కుమార్, చింత గింజల సునీల్ కుమార్ ,వెంకటయ్య, అంకయ్య, గంధం శ్రీను, నీలమ్మ, వెంకటేషయ్య, లక్ష్మమ్మ, సుబ్బమ్మ, గుర్రమ్మ పాల్గొన్నారు.



పిల్లలకు విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ఏర్పేడు : మండలంలోని చిందేపల్లి గ్రామపంచాయతీలో గల ఎస్టీ కాలనీలో ఉన్న పిల్లలకు తిరుపతి పక్కనే ఉన్న రామాపురానికి చెందిన సమీరా పుట్టినరోజు సందర్భంగా పిల్లల చేతుల మీదగా కేక్ కట్ చేపించి 35 మంది పేద పిల్లలకు విద్యా సామగ్రి, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశామని యువ నేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మధురాంతకం మునిశేఖర్ తెలిపారు.

In the Court of the Senior Civil Judge Court : Gudur
S.O.P.No. 209 / 2023
(In the matter of Indian Succession Act)

1. **Anthati Latha,** D/o **Annam Srinivasulu,** Residing at Palamkota, Tripuranthaka Bhatiapalle, Palamkota, Nellore-524132.
2. **Thiragabathina Saritha,** D/o **Srinivasulu,** Wife of **Dasaradhaiah,** Residing at Vallivedu Village, Vallivedu, Venkatagiri, SPSR Nellore District.
3. **Annam Muralikrishna,** Son of **Srinivasulu,** Residing at D.No. 27-10-137, N.T.R. Nagar, 1st Bit, Arch Street, Nellore-524002.
4. **Annam Sunitha,** D/o **Srinivasulu,** Residing at D.No. 27-10-137, N.T.R. Nagar, 1st Bit, Arch Street, Nellore-524002. - Petitioners

Vs

Nill - Respondents

జనరల్ నోటీసు

పై నెంబరున పిటిషనర్లకు తల్లిగారైన యాకసిరి జయమ్మ, W/o శ్రీనివాసులు Venkatagiri APSP 9th Betalian Commandant Office లో Sweeper గా ఉద్యోగం చేస్తూ **తే15-02-2023**దిన చనిపోయి నందున ఆమెకు రావలసిన **డెత్ బెనిఫిట్స్** వగైరాలు తీసుకొనుటకు గాను వారసత్వపు సర్టిఫికేట్ మంజూరు చేయమని కోరుతూ పై పిటిషనర్లు పైతెలిపిన కోర్టులో **S.O.P.No.209/2023** ను దాఖలు చేసియున్నందున, సదరు పిటిషన్‌పై ఎవ్వరికైనను ఆక్షేపణలు ఉన్నయెడల **తే 29-11-2023** దిన ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైతెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసి నదని యిందుమూలముగా యావన్మందికి తెలియజే యడమైనది.

డి.ఎస్.వి.రామకృష్ణ కుమార్, బి.కాం., బి.ఎల్.,
బి.బాలప్రదీప్, ఎం.బి.ఎ., ఎల్.ఎల్.ఎం.,
పిటిషనర్ల తరపు అడ్వకేట్, నెల్లూరు.